# రొట్టెముక్క

డి. కామేశ్వరి

రైలు కీచుమంటూ ప్లాట్‌ఫారంమీద ఆగింది. అంతవరకు నిద్రపోతున్నట్టున్న ప్లాట్‌ఫారం ఒక్కసారిగా మేల్కొంది. రైలు ఆగడం చూసి అంతవరకు చింతచెట్టు కింద గోటీబిళ్ల ఆడుతున్న పెంటిగాడు, సిన్నిగాడు ఒక్క పరుగునవచ్చి గద్దల్లా వ్రాలారు రైలు దగ్గర. అక్కడనించి వాళ్ళ ఆకలిపాట మొదలు 'అమ్మా ఒక ముద్దపడేయి తల్లీ—బాబూ నిన్నకాడనించి గంజి నీళ్ళులేవు ఒక పైసయియ్యి బాబూ, సిన్న రొట్టెముక్క డెయ్యి తల్లీ మీకు పున్నెం వుంటది. అమ్మా-బాబూ మీ కాల్లకి దండం బాబూ.' అరిగిపోయిన గ్రామఫోను ప్లేటులా ప్రతి రైలు వచ్చేసరికి ఆ పాట మొదలు పెడ్తారు. యీగల్లా రైల్లో తింటున్న వాళ్ళమీద ముసురుతారు. జలగల్లా పట్టుకు పీకుతారు. తింటున్న వాళ్ళు వాళ్ళ కాకిగోల భరించలేక, వాళ్ళ గజ్జి చేతులు, చింపిరి జులు, కళ్ళపుసులు, దిస మొలలు చూసి తింటున్న తిండి మింగుడు పడక వాళ్ళని వదిలించుకుంటే చాలని తింటున్న అన్నం ఓ ముద్దో—ఓ రొట్టె ముక్కో తిట్టుకుంటూ పడేస్తారు. యిచ్చేవరకు కంపార్టుమెంటు కిటికీపట్టుక వేళ్లాడుతారు—రైలుకింద నించి పాములా జరజరపాకి యీ ప్లాట్‌ఫారం మీదనించి ఆ ప్లాట్‌ఫాంకి యీ రైలు పెట్టె నించి మరో రైలు పెట్టెకి ఎగబాకుతారు—ప్లాట్‌ఫారం అంతా కలతిరుగుతారు. టీ స్టాలు వాడిని బతిమిలాడుతారు — కాంటీను వాడిని దేబిరిస్తారు—బెంచీలమీద కూర్చున్న ప్రయాణీకుల ప్రాణాలు తోడ్తారు. ఓ ముద్ద అన్నం కోసం, ఓ రొట్టె ముక్కకోసం వాళ్ళు ఏమన్నా చేస్తారు. ఆ చిన్న కడుపులకోసం వాళ్ళ ఆరాటం అంతా యింతాగాదు!

పెంటిగాడు, సిన్నిగాడు కవలలు—ఎనిమిదేళ్ళ క్రితం అదే ప్లాట్‌ఫారంమీద, అదే చింతచెట్టు కింది ఓ గోనెపరదా చాటున, మరో గోనె పరదామీద ఓ ముష్టితల్లి వాళ్ళిద్దరిని కని పడేసింది. వాళ్ళిద్దరి తండ్రి ఎవడో ఆ తల్లికే తెలియదు. ముష్టి సింహాద్రికేపుట్టారో, రైల్వే కూలీల్లో ఎవడికి పుట్టారో, స్వీపర్ నర్సింలు, రంగడికే పుట్టారో ఆ దేముడికే తెలియాలి. ముష్టిదైతేనేం, శరీరం నిండా రోగాలుంటేనేం, వళ్ళంతా దుమ్ముకొట్టుకునుంటేనేం, తల నిండా పేలు కులకుల్లాడితేనేం, మైలుదూరానికి కంపుకొడితేనేం, అవసరానికి ఆడదన్న నిజం మరిచిపోలేని వాళ్ళలో ఏ పుణ్యాత్ముడో, ఆమెకి మాతృత్వం ప్రసాదించాడు—ఆ మాతృత్వం ఆమె పాలిట వరంగాదు, శాపం! ఒకరికి యిద్దరు భూమ్మీదపడ్డాక 'నా కడుపుకే లేదు. ఈ గుంటెదవల్ని ఏటిపెట్టి సావను,' అంటూ నెత్తిబాదుకుంది. 'నారు పోసినోడు నీరు పొయ్యడేటి, నీవు బతకడంలేదా, నాను బతకడంలేదా ఆల్లే పెరుగుతారు గాలికి ధూళికి' అంటూ ఓదార్చింది మరో ముష్టితల్లి.

అలాగే గాలికి ధూళికి పెరిగినట్టే—ఆ చెట్టు కిందే పెంటిగాడు, సిన్నిగాడు పెరిగారు. చింత

★ అబ్బ - ఎంత ఘోరం - ఇంత చిన్న రొట్టె ముక్కకి ప్రాణం 'కాపాడే శక్తేకాదు, తీసేశక్తీ వుందని యివాళే తెల్సింది ★

చెట్టు కింద ఎండలో వళ్లుకాచుకున్నారు, వర్షం నీళ్ళలో స్నానంచేశారు. చెట్టు కింద దుమ్ము పొడరు రాసుకున్నారు —— పక్షుల కిలకిలా రావాలే జోలపాటలయాయి——చింత చెట్టుకిందే పొరాడడం నేర్చుకున్నారు——ప్లాట్ ఫారంమీద అడుగు లెయ్యడం నేర్చారు. రైళ్ళ కూతల మధ్య పలుకులు నేర్చారు. ముష్టితల్లి యిద్దర్నీ చెరోచంకని జోలెకట్టుకుని వచ్చేపోయే రైళ్ళ దగ్గిర అడుక్కునేది——దొరికినదేదో పిల్లల నోట్లో యింతపెట్టి తననోట్లో యింతపెట్టు కునేది——ఏం దొరకనినాడు తిని పారేసిన ఎంగి లాకులు నాకి, పంపులో నీళ్ళు కడుపుపట్టినన్ని తాగేవారు. చెట్టు కింద పిల్లలిద్దరిని చెరో పక్కని పెట్టుకుని పడుకునేది ఆ తల్లి—— పెంటిగాడు, సిన్నిగాడు నడక మాటలు నేర్చిం దగ్గిరనించి తల్లి వెంట అడుగులేసి, చిన్న చేతులు చాపి 'అమ్మా బువ్వ——ఒక ముద్ద తల్లీ——మీకు దండం తల్లీ——' అని అడు క్కోడం నేర్చారు.


పిల్లలకి అడుక్కోడం వచ్చేసింది, యింక తన అవసరం లేదన్నట్టు, రెక్కలొచ్చిన పక్షు లని వదిలిపోయిన పక్షిలా ఆ ముష్టి తల్లి కలరానోకి ఆ చెట్టుకిందే కన్ను మూసింది—— ఆ మూడేళ్ళ దిక్కుమొక్కులేని ఆ పిల్లలని చూసి తోటి ముష్టివాళ్ళు జాలిపడి అడుక్కు తెచ్చుకున్నది తలో ముద్దపడేసేవారు. టీస్టాల్ వాళ్ళు సీనా రేకు డబ్బాలో యింత టీ పోసి చెల్లని పాసిపోయిన రొట్టె ముక్కలు పడేసే వారు. కాంటీను దగ్గిర ఎంగిలాకులు ఏరుకుని నాకేవారు. రైలు ఆగగానే ప్రయాణీకుల ముందు చేతులు చాపేవారు. దొరికిందేదో తిని- చెట్టుకింద పగలల్లా మట్టిలో పొర్లి దొర్లి ఆడి రాత్రి కాగానే వళ్లెరగకుండా ఒకరి నొకరు కౌగలించుకుని నిద్రపోయేవారు.

ఒక్క తిండి విషయంలో తప్ప వాళ్ళిద్దరూ ఆప్తమిత్రులు——తిండి దగ్గిరకి వచ్చేసరికి మాత్రం బద్ధ శత్రువుల్లా మారిపోతారు. ఒకడి చేతిలో ఏదన్న పడిందంటే రెండోవాడు ఎక్కడ అడుగుతాడోనని చేతిలోది చటుక్కున నోట్లో పెట్టేసుకుని గుటుక్కున మింగేస్తారు. అప్పు డప్పుడు ఒకడి చేతిలోది ఒకళ్ళు గద్దలా వాలి తన్నుకు పోతారు. దానికోసం యిద్దరూ కుమ్ము కుంటారు. కుళ్ళ బొడుచుకుంటారు. జుత్తు పీక్కుంటారు. బండబూతులు తిట్టుకుంటారు. కాసేపు ఏడ్చుకుని తరువాత మరచిపోయి మరో రైలు వచ్చేసరికి యిద్దరూ కలిసి పరిగెత్తి ఏక కంఠంతో ముష్టి పాట మొదలు పెడ్తారు.

*　　*　　*

పెంటిగాడు, సిన్నిగాడు అప్పటికి తిండి మొహంచూసి ముప్పై గంటలయింది——నిన్నటి నించి ఎంగిలాకులలో పచ్చళ్ళు——మిగిలిన కూర ముక్కలు అయినా తినడం కుదరలేదు. నిన్న ఉదయం జరిగిన ఒక ఉదంతం వాళ్ళి ద్దరి నోట దుమ్ముకొట్టింది. నిన్న ఉదయం మెయిలు వచ్చి ఆగగానే పెంటిగాడు, సిన్ని గాడు యధాప్రకారం ముష్టిపాట మొదలుపెట్టి ప్రయాణీకులని పీడించడం మొదలు పెట్టారు. ఒక ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో ఓపెద్ద ప్రభుత్వాధికారి బ్రెక్ ఫాస్టు తింటున్నాడు—— పెంటిగాడు కిటికీపట్టుకు వేలాడుతూ 'బాబూ చిన్న రొట్టె ముక్క పడేయండి, మీకాళ్ళకి దండంబాబు, కడుపు మండిపోతంది బాబూ-" అంటూ పో - పో అని కసిరినా, విసుక్కున్నా వదలకుండా జలగలా పట్టుకున్నాడు——ఆయన తింటున్న ఆమ్లెటు, ఆశగా, ఆబగా మాస్తూ వాసన ఆఘ్రాణిస్తూ నోట చొంగ కారుస్తూ ఆకలి చూపులతో, గజ్జి చేతులతో దేవిరిస్తున్న వాళ్ళిద్దరినీ చూడగానే తింటున్న ఆమ్లెట్టు గొంతు దిగనంది ఆయనకి. హాయిగా పేపరు చదువుకుంటూ బ్రెక్ ఫాస్టు ఎంజాయ్ చేయ నీకుండా, మూడు దవ్వ బిళ్ళల్లాంటి రూపాయ లిచ్చి ఆర్డరిచ్చిన యీ బ్రెక్ ఫాస్టు ఈ ముష్టి వెధవలకోసం అన్నట్టుఅడుగుతున్న వాళ్ళిద్దరిని చూసేసరికి దొరగారికి తిక్కరేగింది. ఆఫీసులో రెండువేలు తెచ్చుకునే అధికారయినా ఎదురుగా చేతులు కట్టుకు నిల్చుని చెప్పింది తుచ తప్ప కుండా పాటించడం మాత్రం అలవాటయిన ఆ అధికారిగారికి అఫ్ట్రాల్ ముష్టి వెధవలు

తన మాటకి గడ్డిపోతకన్నా విలువ యీాయకుండా, కేకలేస్తున్నా నిర్లక్ష్యంగా నిలబడిన వాళ్ళిద్దరిని చూసేసరికి ఆయన కోపం కంట్రోలవలేదు—చేతిలో ఆమ్లెట్ ప్లేటులో విసరి కొట్టి—చరచర కంపార్టుమెంటుదిగి, బిరబిర స్టేషన్ మాస్టర్ రూమ్‌వైపు నడిచాడు. అక్కడ అగ్ని పర్వతం బద్దలయినట్టు బరస్టు అయ్యాడు. ఆ స్టేషన్ మాస్టర్ని చెడామడా స్టేషను మాస్టర్నీ, రైల్వే సిబ్బందిని, ముష్టి వెధవల్ని, బీదరికాన్ని, దట్టీ ఇండియానీ తిట్టి తిట్టి ఆఖర్ని ముష్టి వెధవన్నవాడు ఫ్లాట్‌ఫాం మీద కనిపిస్తే నీ ఉద్యోగం ఊడబీకిస్తా, చిప్ప చేతికిప్పిస్తా—అంటూ రైలక్కడ యిరవై నిమిషాలు ఆగుతుంది కనక సావకాశంగా తిట్టి—ఆఖర్ని వార్నింగ్ యిచ్చి ఊపిరి పీల్చుకున్నాడు ఆ అధికారి.



తిట్టాడు- దేశంలో ముష్టి వెధవలందరిని శపించాడు. ముష్టి వెధవల్ని ఫ్లాట్‌ఫారంమీదకి అడుగు పెట్టనండా కంట్రోలు చేయలేని అతని అసమర్థతని దుమ్మెత్తి పోశాడు. స్టేషన్లనీ

'ఎవడవయ్యా నీవు—నీ మోచేతి కింద నీళ్ళు తాగుతున్నానా, నీబాబుగాడి సొమ్మి జీతం యిస్తున్నావా పోవయ్యా నీలాంటి వాళ్ళని చాలామందిని చూశాను

ఆ హా హా - ప్లాట్‌ఫాంమీదకి ముష్టి వెధవని రాకుండా చెయ్యడమా ఇదేదో పెద్ద జోక్ సార్—ఎప్పుడూ వినలేదు. మీరేదో పిచ్చి వాళ్ళలావున్నారు సార్, వాళ్ళని ఆపడం, రానీకుండా చెయ్యడం అన్నది నాకేకాదు, నన్ను పుట్టించిన దేముడికైనా చేతకాదు—ప్రైం మినిస్టరొచ్చినా ఏం చెయ్యలేడు—వెళ్ళండి సార్—మీ కోపం యింట్లోపెళ్ళాం పడితే ఆవిడమీద చూపుకోండి, అంతేగాని నామీదకాదు చూపడం, ఆహాహా ఉద్యోగం ఊడబీకిస్తావా—అసలింతకీ నీనెవడివయ్యా - ఏ బోడి అధికారంతో నన్ను నిలబెట్టి దులుపుతున్నావు—రైల్వే మినిస్టరువా, సెక్రట్రీవా- ఆ చెప్పు వింటాము-కావలిస్తే కంప్లయింటు రాసుకో-పో-పో ' అనేద్దామనుకున్నాడు స్టేషను మాస్టరుఆవేశంగా. అనేసేవాడే—ఖర్మ కొద్ది ఎమర్జన్సీ వుండబట్టి కోపం కంట్రోలు చేసుకున్నాడు - ఏ పుట్టలో ఏ పాముందో వీడెవడో ఇంత ఎత్తు ఎగురుతున్నాడంటే ఎంతెత్తాఫీసరో అయేవుండచ్చు—వీడికోపం మండిపోనూ-నిజంగా కంప్లయింట్ రాశాడంటే—ఎమర్జన్సీ దెబ్బల్లో ఉద్యోగం ఊడినా ఊడచ్చు అని లోపల్నుంచి తన్నుకొచ్చిన కోపాన్ని పౌరుషాన్ని శివుడు గొంతులో గరళం యిముడ్చుకున్నట్టు యిముడ్చుకుని — మరీ భయపడినట్లు కనిపించడానికి నామోషీ అన్పించి కాస్త దర్పంగా తలెత్తి—' ఏం చెయ్యమంటార్ సార్, ఆ వెధవలు యిటు తన్నితే అటు వస్తారు—యీ ముష్టి వెధవల్ని తోలడమేనా మాకున్న డ్యూటీ ' అన్నాడు కాస్త దబాయిస్తున్నట్టు.

'అఫ్‌కోర్స్ - అది నీ డ్యూటీలో భాగమే- స్టేషనులోకి ప్రతి ముష్టి వెధవా జొరపడి ప్రయాణీకులని యిబ్బంది పెట్టకుండా కంట్రోలు చెయ్యడం నీ డ్యూటీ' అన్నాడు ఆఫీసరు మరింత ఫైరవుతూ—తనపై అధికారి కాకుండా మరెవరోవచ్చి చెడామడా నిలబెట్టి దులిపేస్తూంటే, చుట్టూ జనం మూగివింతచూస్తుంటే అవమానం ముంచుకు వచ్చింది. పౌరుషం తలెత్తింది. మొహంలో రక్తం పొంగి ఎర్రబడింది. ఏదో అనేలోపలే యింకా పూర్తవలేదన్నట్టు ఆఫీసరు తోటి ప్రయాణీకులు సపోర్టు బలంతో మరింత పుంజుకుని విజృంభించి 'నీ డ్యూటీ కాదంటే—నీ డ్యూటీ నీవు చెయ్యలేనంటే చెప్పు—అది నీ డ్యూటీ కాదో అవునో పై వాళ్ళనే తేల్చమంటాను. ఏదీ కంప్లయింట్ బుక్ యిలాతే—నే నెవరో తెలుసా నే తల్చుకుంటే నీవు మరింక ఏ డ్యూటీ చెయ్యక్కర లేకుండా చేసేస్తా—' అంటూ యింగ్లీషులో అరిచాడు. చుట్టూ జనం—'అవునండీ. ' ఎవరో వకరు కలగచేసుకోకపోతే లాభంలేదు—చా-ఛా-తిండి తిననీరు. కంపార్టుమెంటులో చొరపడి పోవడం. రామ-రామ-ప్రయాణం అంటే అసహ్యం .. కావల్సిందే - బొత్తిగా ఎవడికీ పట్టనట్టూరుకుంటే వాళ్ళు జలగల్లా పీక్కు తినకేంచేస్తారు. స్టేషను మాస్టర్ ఆ మాత్రం కంట్రోలుచెయ్యకపోతే మరింకెందుకు నాలుగు తగలనిస్తే మళ్ళీవస్తారా ' ప్రయాణీకులంతా ఆఫీసరుతో కలిసి పోగానే స్టేషను మాస్టరు మొహం మరింత ఎర్రబడి పోయింది.


'ఏం కంప్లయింట్ రాయమంటావా—మళ్ళీ ప్లాట్‌ఫాంమీద ముష్టి వెధవల్ని రాకుండా కంట్రోలు చేస్తావా—నీతో ఆర్గ్యూ చేసేదానికి నాకు టైములేదు—' అసహనంగా అరిచాడు ఆఫీసర్.

'మీరు వెళ్ళండి సార్. మళ్ళెప్పుడూ యిలా జరగకుండా చూస్తాం లెండి. ట్రైను కదులుతుంది. పదండి సార్' యిద్దరు ముగ్గురు టికెట్ కలక్టర్లు, గార్డు అంతా రాజీ ధోరణిలో మాట్లాడారు.

'రైలు కదులుతుంది—ఎలా కదులుతుందో నేనూ చూస్తాను—ఈ అంతుతేలందే కదలను'

ఆఫీసరు మొండికెత్తాడు. స్టేషనుమాష్టరు తలదించక తప్పలేదు "'మీరు వెళ్ళండి సార్, ఏక్షన్ తీసుకుంటాను'అన్నాడు గొంతు పెగుల్చుకుని ఆఖరికి.

నిజంగానే ఏక్షన్ తీసుకున్నాడు. ఆఫీసరు




జరిపిన అవమానం, నలుగురి ముందు జరిగిన పరాభవం—దాని కంతటికీ కారణం అయిన ఆ గుంట వెధవలమీద చాలా పెద్ద ఏక్షనే తీసుకున్నాడు. కాంటీను దగ్గిర ఎంగిలాకులు నాకుతున్న ముసలిదాని వీపో కాలితో తన్నాడు. బూటుతో కుక్కని బొడిచాడు, చేతిలో లాఠీతో కొట్టు పిల్లగాళ్ళని—కసిదీరా చెంపలు అదర గొట్టాడు. గడ్డపు దాపెట్టు యిచ్చిన వాడి, ఇచ్చిన కలిపి పుల్లల్ని సరాపలు గోడమీదనించి విసిరేసిన ప్లేట్లను కిటకిటలమీదనించి రోడ్డు మీదకి విసిరేశాడు.

బండబూతులు తిట్టాడు, మళ్ళీ ఆ చాయల కనిపిస్తే పాతేస్తానన్నాడు. లోపలికి అడుగు పెడితే కాళ్ళిరగ కొడ్తానన్నాడు. నోరు మెదిపితే నాలుక తెగగోస్తానన్నాడు. అరగంటసేపు వాళ్ళని తన్ని, కుమ్మి, తిట్టి తనకోపం శాంతించాక, "రాస్కెల్స్, డర్టీ రాస్కెల్స్-లంజా కొడుకులు — ఏముండో కనిపారేయడం — ఈవెధవలు మా పీకలమీద ఎక్కి కూచోడం గాడిదకొడుకులు యీసారి కనిపించండి " అంటూ అరుస్తూ లోపలికెళ్ళాడు. పెంటిగాడు, సిన్నిగాడు యీ జరిగిన గొడవ కంతటికీ తామే కారణం అన్న సంగతి అర్థంకాక, స్టేషను మాష్టరు ఎందుకు కొడుతున్నాడో, తిడుతున్నాడో తెలియక కళ్ళప్పగించి బిక్కచచ్చి వుండిపోయాడు. వాళ్ళిద్దరినీ కొట్టడంచూసి మిగతా ముష్టివాళ్ళంతా తాత్కాలికంగా ఆ చెట్టు కిందనించి జారుకున్నారు.

వంటికి అంటుకున్న దుమ్ము - నోట్లోంచి కారిన రక్తం, చెక్కుకుపోయి మండుతున్న గాయాలు, కారే కన్నీళ్లు అన్నీ తుడుచుకున్నాక తోటి ముష్టివాళ్ళు ఆదెబ్బలకి కారణం చెప్పాక మళ్ళీ ఆ స్టేషను లోపలికి అడుగు పెట్టడానికి ధైర్యం చాలలేదు. యిద్దరూ వితుకువితుకు మంటూ ఆ గజాల దగ్గిరే ముడుచుకు కూర్చు న్నారు. వాళ్ళిద్దరూ పుట్టి బుద్ధి ఎరిగిన ఈ ఎనిమిదేళ్ళల్లో ఆ స్టేషను తప్పబయట ఓ ప్రపంచంవున్నదన్న సంగతి ఎరగరు-ఆ స్టేషను ఆవరణ దాటి ఎరగని ఆ యిద్దరూ స్టేషనులోకి రావద్దంటే మరెక్కడన్నా వెళ్ళి అడుక్కోవచ్చని కూడా తెలియనంత అయోమయంలో, ఎక్కడి కన్నా వెడితే తల్లినించి తప్పడి జనంలో కలిసి పోతామని తల్లి కొంగు విడవని పసివాళ్ళలా ఆ స్టేషను గజం బద్దలు పట్టుకుని వచ్చేపోయే

రైళ్ళను చూస్తూ, అమ్మే తినుబండారాలుచూస్తూ కింద విసిరేసిన ఎంగిలాకులు చూస్తూ నోట చొంగ కార్చుకుంటూ, ఆశగా, ఆబగా, దీనంగా ఆరోజంతా ఆకలి కడుపులతో నకనకలాడి, రాత్రి కాంగానే ఆ మట్టిలోనే ఆ గజాల నానుకునే నిద్రపోయేరు.

తెల్లారగానే — నిన్న భయానికి అణిచి పెట్టిన ఆకలి మరి ఏమయినా ఆగనన్నట్టు విజృంభించింది. పెంటిగాడు, సిన్నిగాడు నకనకలాడుతున్న కడుపులని ఎలా నింపుకోవాలో తెలియక బిక్కమొహాలు వేసుకునిల్చున్నారు. ధైర్యంచేసి గజాల మధ్యనించి దూరి ప్లాట్ ఫారమ్‌మీదకి వెళ్ళాలన్న ఆరాటాన్ని అదుపులో పెట్టుకోవడం కష్టమయి పోసాగింది వాళ్ళకి - మరుక్షణం నిన్న కొట్టిన దెబ్బలు తాలూకు నల్లగా కమిలిపోయిన, రక్తం కారిన, చెక్కుకుపోయిన గుర్తులు కళ్ళముందు కనపడుతూంటే - ఆకలి ముందుకు లాగుతూంటే భయం వెనక్కి లాగుతూంటే ఏం చెయ్యాలో తెలియక గజాలు పట్టుకు నిలున్నారు.

అదే సమయంలో మెయిలువచ్చి ఆగింది. గజాల అవతల నిలబడ్డ వాళ్ళిద్దరి ఎదురుగా ఓ ఫస్టు క్లాస్ కంపార్టుమెంటు ఆగింది.

అక్కడ కిటికీ దగ్గిర ముద్దులు మూటకట్టే ఐదేళ్ళ పిల్లాడు కూర్చుని అటూయిటూ చూస్తున్నాడు. పిల్లాడికి యిరుపక్కలా అందం, యవ్వనం, ఐశ్వర్యం, ఆధునికత కలిసి మిసమిసలాడుతున్న తల్లితండ్రులు కూర్చున్నారు. రైలు ఆగగానే కంపార్టుమెంటులోకి బేరర్ బ్రెక్‌ఫాస్టుట్రే తీసుకు వెళ్ళాడు. ఆట్రేలోంచి ఓ సాండ్‌విచ్ తీసి కుర్రాడికి యిచ్చి తినమని బ్రతిమిలాడుతుంది తల్లి. కుర్రాడు వద్దంటూ తల ఆడిస్తున్నాడు. కుర్రాడి చేతిలో బలవంతంగా సాండ్‌విచ్‌పెట్టి తల్లితండ్రి కాఫీ తాగసాగారు. కుర్రాడు చేతిలో రొట్టెపట్టుకుని తినకుండా ప్లాట్‌ఫారమ్‌మీద సందడి కుతూహలంగా గమనిస్తున్నాడు.

ఆ కుర్రాడి చేతిలో రొట్టె చూసేసరికి


శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 26, నార్తుబోగ్ రోడ్, మద్రాసు-17.




దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు ఆకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయినిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నములు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయుబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం - రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయుబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

బ్రాంచీలు:- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.

# (వి)చిత్ర విజ్ఞానం




రష్యాలో "రిట్ మోసోన్" అనబడే ఒక విద్యుత్ పరికరం కనిపెట్టారు. దీనితో, నిద్ర రాకుండా బాధపడేవారు, హాయిగా నిద్రపోవచ్చు! ఈ పరికరం నుండి పుట్టే శబ్దతరంగాలు నిద్రను పుట్టిస్తాయి. దీనితో, దేహానికి పరోక్షంగా హానిని కలిగించే నిద్రమాత్రలకు స్వస్తి చెప్పవచ్చు!

---

పెంటిగాడికి సిన్నిగాడికి మరిచిపోయిన ఆకలి విజృంభించింది. ఆ రొట్టె చూడగానే యిద్దరి కళ్ళు మిలమిల్లాడాయి. నోట్లో నీరూరింది. యిద్దరి కళ్ళు కల్సుకున్నాయి. వెంటనే యిద్దరూ నిస్సహాయంగా, యిటు అటు తిరుగుతున్న టి. సిలని గార్డుని చూశారు. అంతలో పెంటిగాడిబుర్రలో ఓ ఆలోచన తళుక్కుమంది. వాడి కళ్ళు మెరిశాయి, ఆ రహస్యం సిన్నిగాడి చెవిలో ఊదాడు. యిద్దరూ రాబందుల్లా అవకాశం కోసం చూశారు.

గార్డు విజిల్ వేశాడు. రైలు నెమ్మదిగా కదిలింది. వేగం అందుకుంటూంది. పెంటిగాడు చటుక్కున జనాల మధ్యనించి దూరి మెరుపులా పరిగెత్తి కిటికీ దగ్గిర కూర్చున్న కుర్రాడి చేతిలో రొట్టె ముక్క లాగేశాడు. మరో క్షణంలో వెనక్కి పరిగెత్తేవాడేకాని వాడి ఖర్మకాలి ఆ తండ్రి చూడడం ఏమిటి చటుక్కున 'చోర్ చోర్' అంటూ పెంటిగాడి చెయ్యి పట్టేశాడు. ఆ చేతిలోంచి తన చెయ్యి లాక్కోవాలని పెంటిగాడు ఎంత గింజుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఖల్లూకంలాంటి ఆ పట్టునించి తప్పించుకోలేక, రైలు వేగం అందుకుంటూంటే దాంతో సరిగా పరిగెత్తలేక, కుక్క నోటకరిచిన కోడిపెట్టలా గాలిలో కాళ్ళు తన్నుకుంటూ గిలగిల కొట్టుకున్నాడు. 'చోర్ బద్మాష్ - పకడో - అంటూ తమ ధనధాన్యాలు కొల్లగొట్టినంత హడావిడిగా అరుస్తూ— 'పుల్ దట్ చైన్' అంటూ భార్యవంక తిరిగి అరిచాడు. పెంటిగాడు ఆఖరి ప్రయత్నంగా తన చెయ్యి పట్టుకున్న ఆ పెద్ద మనిషి చెయ్యి ఛటుక్కున కొరకడం, ఆ పెద్ద మనిషి ఓ కేకపెట్టి పట్టు విడవడం, రైలు వేగంతో బాలన్స్ కుదరక ప్లాట్‌ఫారంకి రైలుకి మధ్య ఖాళీ స్థలంలో పెంటిగాడు పడడం, అంతవరకు తెల్లపోయి చూస్తున్న జనం హాహాకారాలు, సిన్నిగాడి కెవ్వుమన్న కేకతో - చైన్‌లాగబడిన రైలాగింది.

ఆగిన రైలు పెంటిగాడి కోసం మరి కాస్త ముందు కెళ్ళాకగాని పెంటిగాడు దొరకలేదు. దొరికిన పెంటిగాడు పెంటిగాడిలాలేడు. ఏ ముక్కకాముక్క తెగిపడి రక్తం ముద్దలా వున్నాడు. రక్తం ముద్దని చూసి అంతా నోట మాటరాక ఒక్క క్షణం నిలబడిపోయారు. జనాన్ని తోసుకు ముందుకు పరిగెత్తి వచ్చిన సిన్నిగాడు - పెంటిగాడిని .తనకున్న ఏకైక బంధువు, తోబుట్టువు, ఆప్తుడు, మిత్రుడిని చూసి కెవ్వుమనలేదు. నెత్తి కొట్టుకుని ఏడవలేదు. ఒక్క క్షణం దిగ్భ్రాంతితో నిలబడిపోయాడు. తరువాత వాడికళ్ళు చురుకుగా దేని కోసమో వెతికాయి. రక్తం ముద్దకి కాస్త దూరంగా సిన్నిగాడు వెతుకుతున్నది కనపడింది. అది దూరంగా తెగిపడిన పెంటిగాడి చెయ్యి. ఆ చేతిలో గుప్పెట్లో బిగించిన రొట్టె ముక్క!! సిన్నిగాడు ఒక్క ఉదుకున అక్కడికి దూకి ఆ చేతిలోంచి రొట్టె ముక్కతీసి చటుక్కున నోట్లో పెట్టేసుకున్నాడు. □